ప్రజాశక్తి

బుధవారం 30 జులై 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

స్మాల్ బిజినెస్... స్మార్ట్ బిల్స్...

● చిరు, మధ్య తరగతి వ్యాపారులపై తీవ్ర ప్రభావం ● రెండు రెట్లు పెరిగిన విద్యుత్ బిల్లులు

ప్రజాశక్తి - గన్నవరం : "విద్యుత్ స్మార్టు మీటర్లను పగలగొట్టండి" అని ప్రతిపక్షంలో ఉండంగా పిలుపు ఇచ్చిన సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అధికారంలోకి వచ్చిన తర్వాత మీటర్లు పెట్టిస్తూ.. మాట తప్పారని విద్యుత్ వినియోగదారులు విమర్శిస్తున్నారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలంలో తమకు స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత అధికంగా బిల్లులు వస్తున్నాయని చిరువ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. తాము సంపాదించిన మొత్తంలో సగానికిపైగా విద్యుత్ బిల్లులు చెల్లించడానికే ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నవరంలో సుమారు 600కిపైగా చిన్న దుకాణాలున్నాయి. 100 వరకు మధ్యస్థంగా ఉండే షాపులున్నాయి. అదానీ కంపెనీకి చెందిన సిబ్బంది అన్ని షాపులకూ స్మార్ట్ మీటర్లు బిగించి వెళ్లారు. ఆ తర్వాత ఆయా షాపులకు ఒక్కోదానికి రూ.500 నుంచి రూ.1500 వరకు క్రమంగా విద్యుత్ బిల్లులు పెరుగుతూ వస్తున్నాయి. అదానీ కంపెనీ సిబ్బంది వచ్చి.. "తప్పనిసరిగా స్మార్ట్ మీటర్ పెట్టాల్సిందే, లేకపోతే మీకు కరెంటు ఆగిపోతుంది" అని బెదిరించి మరి మీటర్లు బిగించారని వ్యాపారులు చెబుతున్నారు. స్మార్టు మీటర్లు వద్దంటే కరెంటు ఆగిపోతుందనే భయంతో వ్యాపారులు మిన్నకుండిపోయారు. అయతే స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత కరెంటు బిల్లుల కష్టాలు మరింత పెరిగాయి. ఇలాగైతే తమ వ్యాపారాలను మూసివేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని చిరు, మధ్య తరగతి వ్యాపారులు వాపోతున్నారు.

గన్నవరంలో మోహన్ (సర్వీస్ నెంబర్ 6511227000844) అనే వ్యక్తి షాపుకు స్మార్ట్ మీటరు ఏర్పాటు చేశారు. పాత బిల్లు ఏప్రిల్‌లో రూ.1095 బిల్లు వస్తే, స్మార్ట్ మీటరు పెట్టిన తర్వాత జూన్లో రూ.1575 వచ్చింది. అంటే అదనంగా రూ.480 బిల్లు పెరిగింది. అలాగే ఎం.అప్పారావు అనే షాపు యజమాని (సర్వీస్ నెంబర్ 6511216000177)కు పాత బిల్లు ఏప్రిల్‌లో 2174 కరెంట్ బిల్లు రాగా, స్మార్ట్ మీటరు బిగించిన తర్వాత కొత్త బిల్లు జూన్లో రూ.4031 బిల్లుగా వచ్చింది. దీంతో సగానికి పైగా బిల్లు పెరిగింది. అంటే అదనంగా రూ.1857 బిల్లు పెరిగింది. పి.సత్యం అనే షాపు యజమానికి (సర్వీస్ నెంబర్ 6511225000320) ఏప్రిల్లో రూ.2135 బిల్లు రాగా, స్మార్ట్ తర్వాత జూన్లో రూ.2625 బిల్లు వచ్చింది. అంటే అదనంగా రూ.490 బిల్లు పెరిగింది. కె.కుమార్ అనే వ్యక్తి షాపుకూ (సర్వీస్ నెంబర్ 661122500360) విద్యుత్ బిల్లు పెరిగింది. ఏప్రిల్లో బిల్లు రూ.1602 రాగా, జూన్లో రూ.1974 వచ్చింది. అదనంగా రూ.372 పెరిగింది.

ఇబ్బందులు పడుతున్నాం : లక్ష్మి, వినియోగదారులు

స్మార్ట్ మీటర్లతో ఇబ్బందులు పడుతున్నామని లక్ష్మి (సర్వీస్ నెంబర్ 6511227000845)

(మిగతా 2లో)



ప్రకాశం బ్యారేజీకి వరద ఉధృతి

● నేడు 3 లక్షల క్యూసెక్కులు వచ్చే అవకాశం

● అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ, సిటీ : ప్రకాశం బ్యారేజీ వద్ద క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువ ప్రాజెక్టుల నుండి భారీగా వరద నీరు వస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. పులిచింతల ప్రాజెక్టు నుండి ప్రకాశం బ్యారేజీకి 65,000 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మూడు లక్షల క్యూసెక్కుల వరకు వదర పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం నాటికి వరద 3 లక్షల క్యూసెక్కుల వరకు చేరుతుందని అంచనా. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న అధికారులతో మంగళవారం అత్యవసరంగా కలెక్టర్ లక్ష్మీశ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. కష్ణా నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. ఇసుక బస్తాలు, ఇతర రక్షణ చర్యలు చేపట్టేలా చూడాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. టాం టాం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా మత్స్యకారులను చేపల వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. వరదలపై కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వైద్య రంగ ప్రైవేటీకరణతో

సామాన్యులకు ప్రజారోగ్యం దూరం

● ప్రజారోగ్య వేదిక సదస్సులో పలువురు వైద్యుల ఆందోళన

● వేదిక కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసరావు, శ్రీధర్

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : వైద్య రంగ ప్రైవేటీకరణతో సామాన్యులకు ప్రజారోగ్యం దూరమవుతుందని పలువురు వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం ఈశ్వర రెసిడెన్సీలో మంగళవారం ప్రజా ఆరోగ్య వేదిక సదస్సు నిర్వహించారు. "ప్రైవేటు కోరల్లో ప్రజారోగ్యం" అంశంపై జరిగిన ఈ సదస్సులో సీనియర్ వైద్యులు డాక్టర్ రావి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతిస్తే చివరికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరుగుతున్న నార్మల్ డెలివరీలు కూడా కనుమరుగవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ సురేష్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో ప్రభుత్వ నూతన విధానాలపై వాకర్స్ అసోసియేషన్, మేధావులు విద్యార్థి సమూహాలతో కలిసి చర్చించడం, సంతకాలు సేకరించడం ద్వారా వచ్చే అభిప్రాయాలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లవచ్చని సూచించారు. సీనియర్ వైద్యులు కె.శాస్త్రి మాట్లాడుతూ సామాన్యులకు అందుబాటులో ఉన్న పిహెచ్‌సిలు చాలాచోట్ల పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేకుండా ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్నాయన్నారు. ఉదాహరణకు మచిలీపట్నం ఒగ్రెగూడెంలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రంలో నెలలు తరబడి డాక్టర్ సెలవుల్లో ఉంటున్నారన్నారు. వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేస్తే ప్రజలకు ప్రశ్నించే అవకాశం కూడా లేకపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ టి.కామేశ్వరరావు



ప్రజారోగ్య వేదిక కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులు రావి శ్రీనివాసరావు, వి.శ్రీధర్

(మిగతా 2లో)

ఆటో, ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వార్త 8లో



భూ కేటాయింపులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

వైసిపి ధర్నాలో మల్లాది విష్ణు డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రైవేటు వ్యక్తులకు, కార్పొరేట్ కంపెనీలకు భూ కేటాయింపులపై కూటమి ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ ఎంఎల్‌ఎ, వైసిపి సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. వందల కోట్ల విలువైన పాత బస్టాండ్ విలువైన స్థలాన్ని లూలూ కంపెనీకి కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నెంబర్ 137ను రద్దు చేయాలన్నారు. విజయవాడ పాత బస్టాండ్‌తోపాటు గవర్నరుపేట, విద్యాధరపురం తదితర ఆర్టీసి డిపోల స్థలాలను కారు చౌకగా లూలూ కంపెనీకి ఇస్తూ జారీ చేసిన జీఓను రద్దు చేయాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఆపార్టీ శ్రేణులు... ఆర్టీసి స్థలాలను కార్పొరేట్ కంపెనీకి ఇవ్వొద్దని, ఆర్టీసి స్థలాలను కాపాడాలని, డౌన్‌డౌన్ కూటమి ప్రభుత్వం అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాది విష్ణు మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన 4.15 ఎకరాల ఆర్టీసి పాత బస్టాండ్ స్థలాన్ని లూలూ కంపెనీకి అత్యంత కారుచౌకగా కట్టబెడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం జీఓ విడుదల చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. ప్రభుత్వ చర్యతో గాంధీనగర్, బీసెంట్‌రోడ్డు, వన్‌టౌన్ పరిసర ప్రాంతాల్లోని చిన్న, మధ్య తరగతి వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని, వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్లు కొండయ్యగుంట మల్లేశ్వరి, ఎర్రగొర్ల తిరుపతమ్మ, ఈసరపు దేవి, అలంపూరి విజయ్ పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేలతో కాల్వల్లో వ్యర్థాల తొలగింపు : ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ : డ్రోన్ సర్వేలతో కాల్వల్లోని వ్యర్థాలను తొలగించి, శుభ్రపరచాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సత్యనారాయణపురం, బి ఆర్ టి ఎస్ రోడ్, నాగేశ్వరరావు పంతులు రోడ్డు, శివరావు స్ట్రీట్, హెచ్ బి కాలనీ, ప్రియదర్శిని కాలనీ, క్రాంబే రోడ్డు ప్రాంతాల్లో కమిషనర్ మంగళవారం పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు పాల్గొన్నారు.



సాగు పెట్టుబడికి రైతుల అవస్థలు

ప్రజాశక్తి - గన్నవరం : పేద రైతులు ఎన్నో ఆశలతో వ్యవసాయం మొదలు పెట్టారు. అష్టకష్టాల కొర్చి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికీ ఎకరానికి ఏడు వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. అయితే బ్యాంకర్లు ఒక్క రూపాయి రుణం కూడా రైతులకు ఇవ్వలేదు. దీంతో పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల వెంట పడాల్సి వస్తోంది. వందకు మూడు రూపాయల వడ్డీ చొప్పున పెట్టుబడికి అప్పులు చేస్తున్నారు. పెట్టుపడి అప్పు తీసుకోవడం ఆతస్యమైతు వడ్డీ నాలుగు రూపాయలు వసూలు చేస్తున్నారు. పంట రుణాలు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. నిబంధలన పేరుతో బ్యాంకర్లు రిక్తహస్తాలు చూపుతున్నారు. వ్యవసాయ సాగులో అవసరమైన ఎరువులు కూడా అరకొరగానే అందుబాటులో ఉంటున్నాయి. మార్కెట్లో వాటి ధరలు పెరగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతిలో చిల్లిగవ్వలేకపోవటంతో వాటిని ఎలా కొనాలో అర్థం కావటం లేదని రైతులు మదన పడుతున్నారు. అర్హులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వకుండా తిపుకుంటున్నారు. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో బ్యాంకర్లు కౌలుదారులకు రుణాలు ఇవ్వటం లేదు. కమర్షియల్ బ్యాంకర్లు పేద రైతులతో ఆటలాడుతున్నారు. గన్నవరం, సూరంపల్లి, బాపులపాడు, ఆరుగొలను తదితర గ్రామాల్లోని బ్యాంకర్ల నిర్లక్ష్యంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పాలకులు అన్నదాతల జీవితాలతో ఆటలాడుతున్నారు. అధికారులు కూడా అలక్ష్యం చేయటం తగదని వారంటున్నారు. పాస్ పుస్తకాలు లేవనే పేరుతో చాలామంది రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం కొత్తగా పాస్ పుస్తకాలు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. రైతులు ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా తమకు వ్యవసాయ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బ్యాంకుల చుట్టూ తిరుగున్నా ఫలితం లేదు : టి.రాంబాబు

రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించటంలేదు. సొంతంగా రెండెకరాలు, కౌలుకు మరో రెండెకరాలు సాగుచేస్తున్నా. సాగు పెట్టుబడికి రూ.50 వేలు అవసరం అవుతాయి. ఎకరానికి రూ.25 వేల చొప్పున రుణ పరపతి కల్పిస్తామని ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. కానీ బ్యాంకులు రూపాయి ఇవ్వటం లేదు. అదేమంటే నిబంధనలు అంటూ తిప్పుకుంటున్నాయి. వ్యవసాయంలో అదునుపోతే ఉపయోగం ఉండదు. ప్రస్తుతం నాట్లతోపాటు ఎరువులు వేయాల్సి ఉంది.



వాటిని కొనడానికి రుణం కావాలని కోరుతున్నా పట్టించుకోవటం లేదు. చాలా ఇబ్బంది పడుతున్నాం.

అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాం : రెడ్డియ్య

కౌలుదారులంటే అధికారులకు లెక్కలేకుండా పోతోంది. పోరాటాలు చేస్తే పాలకులు దిగొచ్చి గుర్తింపు కార్డులు ఇచ్చారు. వాటితో రుణం పొదొచ్చని ఆశ పడ్డాం. కానీ బ్యాంకర్లు నిరాశే మిగిల్చారు. గతంలో తీసుకున్న రుణాలు చెల్లిస్తేనే వెంటనే రుణాలు ఇస్తామన్నారు. కట్టిన తర్వాత రుణం ఇవ్వటం కుదరదని అంటున్నారు. ఏం చేయాలో అర్థం కావటంలేదు. మూడెకరాల్లో సాగుకు రూ.75 వేల వరకు అవసరం ఉంటుంది.

కౌలుదారులంటే లెక్కలేదు : సాంబశివరావు

చేతిలో చిల్లి గవ్వ లేదు. బ్యాంకర్లు రుణాలు ఇస్తారని బయట అప్పులు తెచ్చి పెడుతున్నాం. బ్యాంకుల దగ్గరకు వెళితే సాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా బ్యాంకులు రుణాలు ఇచ్చి ఆదుకోవాలి.

దసరా ఉత్సవాలకు ప్రణాళికలు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ, సిటీ : విజయవాడ శ్రీ కనక దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆధ్వర్యాన జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు 11 రోజులపాటు జరిగే దసరా ఉత్సవాలపై కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారుల సమావేశం జరిగింది. జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల ఆలయ ఈవో వీకే శీనానాయక్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది రోజుకు దాదాపు లక్ష మంది దుర్గమ్మ దర్శనానికి వచ్చే అవకాశముందన్నారు. సిపి రాజశేఖరబాబు మాట్లాడుతూ డ్రోన్లు, సీసీ కెమెరాలతో పటిష్ట పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈసమావేశంలో ఆలయ స్థానాచార్యులు వి.శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, డీసీపీ కేజీవీ సరిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో సిపి

రాకేష్ ఇంటికి వచ్చిన మంత్రి అనిత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం భవానీపురంలోని ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ ఇంటికి మర్యాదపూర్వకంగా వచ్చారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఛాంబర్ వైస్ ప్రెసిడెంట్ వివికె.నరసింహారావు, గొల్లపూడి మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అరుణ్, మెడికల్ అసోసియేషన్ నుండి సాదు ప్రసాద్, గొల్లపూడి కాంప్లెక్స్ నుండి పరుచూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మార్గదర్శులుగా ముందుకు రండి : లక్ష్మీశ

పజాశక్తి - విజయవాడ : పీ4 లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు మార్గదర్శులుగా భాగస్వాములై బంగారు కుంటుంబాలకు చేయూత అందించాలని కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్లో మంగళవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, అనుమతులపై చర్చించారు. ఈ ఏడాది మే 26 నుండి జూలై 28 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు 1148 దరఖాస్తులు స్వీకరించగా, ఇప్పటికే 1113 ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

మొదటిపేజీ తరువాయి

స్మాల్ బిజినెస్...స్మార్ట్ బిల్స్...

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమె గన్నవరంలో హోల్‌సేల్ షాపు నిర్వహిస్తున్నారు. గతంలో ఎంత వ్యాపారం ఉందో ప్రస్తుతం అంతే ఉంది. అయితే పాత మీటరు ఉన్నప్పుడు ఏప్రిల్లో రూ.1200 బిల్లు రాగా, స్మార్ట్ మీటరు బిగించిన తర్వాత జూన్లో రూ.1800 వచ్చింది. ఒక్కసారిగా రూ.600 పెరిగింది. పైగా 23, 24 సంవత్సరాల పిపిఎల్ ఛార్జీల పేరుతో రూ.500 వరకు అదనపు భారం వేశారు.

కేంద్రాన్ని మూసివేసే పరిస్థితి వచ్చింది : వేణు, వినియోగదారుడు

తాము నిర్వహిస్తున్న శుద్ధ జల కేంద్రాన్ని మూసివేయాల్సిన పరిస్థితి వచ్చిందని వేణు (సర్వీస్ నెంబర్ 651122500400) అనే వినియోగదారుడు వాపోతున్నారు. గత కొంతకాలంగా శుద్ధ జల కేంద్రాన్ని నిర్వహిస్తున్నానని, గతంలో రూ.5 వేలు వరకు బిల్లు వచ్చేదని, స్మార్టు మీటరు బిగించిన తర్వాత ఏప్రిల్లో రూ.6,300, జూన్లో రూ.8,800 వచ్చింది. దీంతో వాటిని చెల్లించలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈవిధంగా బిల్లు పెరుగుతూ ఉంటే కేంద్రాన్ని మూసివేసే పరిస్థితి వస్తుంది. లేదంటే మంచినీరు రేట్లను ఒకటికి మూడు రెట్లు పెంచాలి. అలా చేయడం వల్ల వ్యాపారం బాగా తగ్గిపోతుంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

స్మార్ట్ మీటర్ల అడ్డుకుంటాం : ప్రజా వేదిక నాయకులు ఆంజనేయులు

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తున్నాం. జనాన్ని విద్యుత్ పోరాటానికి సన్నద్ధం చేస్తున్నాం. ఇప్పటికే ముస్తాబాద్‌లో స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు వచ్చిన అదాని సిబ్బందిని తిప్పిపంపారు. అన్ని గ్రామాల్లోనూ ఈ విధమైన చైతన్యం రావాలి.

సామాన్యులకు ప్రజారోగ్యం దూరం

ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా వచ్చే వైద్య కళాశాలన్నీ పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కావడంతో ప్రజారోగ్యం కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంతో అభివృద్ధి చెందిన స్విట్జర్లాండ్ దేశంలో ఆసుపత్రులన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే నడుస్తాయని గుర్తుచేశారు. అభివద్ధి విషయంలో స్విట్జర్లాండ్‌ను, సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకోవాలని చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మరి అక్కడి వైద్య విధానాలను మన రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయడంతోపాటు, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 200 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించాల్సి ఉందని, వీటిని కూడా పిపిపి పద్ధతిలోనే చేపడతామని ప్రభుత్వం చెప్పడం వైద్య రంగాన్ని పూర్తిగా ప్రైవేటుపరం చేయడమే అవుతుందన్నారు. ఈసదస్సులో డాక్టర్ ప్రసాద్‌రావు, పలువురు విశ్రాంత వైద్య ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య వేదిక కృష్ణాజిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీనివాసరావు, శ్రీధర్

సదస్సు అనంతరం ప్రజారోగ్య వేదిక వేదిక కృష్ణాజిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా రావి శ్రీనివాసరావు, వి.శ్రీధర్, కమిటీ సభ్యులుగా ప్రముఖ వైద్యులు సురేష్ చంద్రారెడ్డి, కె.శాస్త్రి, ప్రేమ్, అల్లాడి శ్రీనివాస్, హరిచరణ్, కె.రాజారావు, వై.వి.ఎస్.కనకరాజు, ఎస్.కాశిమ్మ, కె.లక్ష్మీలను ఎన్నుకున్నారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

మహిళ, నలుగురు మైనర్లతో సహా పది మంది అరెస్టు


వివరాలు తెలియజేస్తున్న డిఎస్‌పి రాజా

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్
మచిలీపట్నం చిలకలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం మాచవరం మెట్టు డొంక రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి నిందితుల వద్ద నుండి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒక మహిళ, నలుగురు బాలురు ఉండటం గమనార్హం. మచిలీపట్నం డిఎస్‌పి సిహెచ్.రాజా తెలిపిన వివరాల ప్రకారం... గంజాయి రవాణా చేస్తున్నారనిచిలకలపూడి ఎస్సై సుబ్రమణ్యంకు సమాచారం అందడంతో మాచవరం డొంక రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించగా ఆరు కిలోల గంజాయితో కొంతమంది వ్యక్తులు పట్టుబడ్డారని తెలిపారు. నిందితుల వద్ద లభ్యమైన గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారింగా మరి కొంతమందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. ఒక మహిళ, నలుగురు మైనర్‌లతో సహ పది మందిని అదుపులోకి తీసుకున్నారు. మహిళతో సహ ఆరుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, నలుగురు బాలురును విశాఖపట్నం జువైనల్ హోమ్‌కు తరలించామని డిఎస్పీ తెలిపారు. మచిలీపట్నం నగరంలో చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి వినియోగం, అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూర్చడానికి చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధి ఇటీవల గంజాయ్ కేసులలో దాదాపు 20 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఉన్నతాధికారులు చిలకలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో మరింతగా తనిఖీలు నిర్వహించి గంజాయిపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పశుసంవర్ధక శాఖ ఇంటింటి సర్వే

ప్రజాశక్తి-నందివాడ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పశుపోషకుల క్రెడిట్ ఇన్సూరెన్స్ అవసరాలపై సర్వేను ఆ శాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని తమిరిశ, వెన్ననపూడి, కుదరవల్లి గ్రామంలో యలమర్ర సహాయ సంచాలకులు డాక్టర్ జి.వి. నరసింహారావు, మండల పశువైద్యులు డా. హెచ్ జయంత్, డా.జి. రామకృష్ణ తమ సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో పశువులు, కోళ్ళ, గొర్రెలు, మేకలు ఉన్న గృహాలను సందర్శించి వారి వివరాలను సేకరిస్తున్నారు. ఆగస్ట్ నెల 31వ తేదీలోగా అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వేను పూర్తి చేయాల్సి ఉందని, ఈ సర్వే ప్రధాన లక్ష్యం రైతుల స్థితిగతులను తెలుసుకోవడం, వారి స్థితిగతులకు అనుగుణంగా ప్రభుత్వం నుండి రుణాల మంజూరు వంటి అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ప్రస్తుతం దేశంలో ఐదో స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని పాల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని నరసింహారావు తెలిపారు.

దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి-గన్నవరం: చోరీలకు పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు, బంగారపు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు గన్నవరం డిఎస్‌పి చలసాని శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తేలప్రోలు సర్వీస్ రోడ్డు బండారుగూడెం గ్రామం కటింగ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో గతంలో బైక్‌లు, ఇళ్లల్లో దొంగతరాలను పాల్పడిన దేవప్రకాష్ (కాకినాడ జిల్లా), పెద్దప్రోలు అశోక్ కుమార్ (విజయవాడ), నాయిని ప్రభు కుమార్ (విజయవాడ) వేము ప్రసన్న రాజు (తాడేపల్లి)లను వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది సహాయంతో పట్టుకున్నారని చెప్పారు. నిందితుల దగ్గర నుంచి మొత్తం 16 గ్రాముల బంగారం వస్తువులు, నగదు రూ.57 వేలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను నూజివీడు కోర్ట్‌లో ప్రవేశపెట్టగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జంక్షన్ సిఐ సత్యనారాయణ, వీరవల్లి ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు



సిఎం సహాయనిధి పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం నియోజకవర్గంలోని ఇద్దరు రోగులకు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఎల్ఓసిలను ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అందజేశారు. బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ మాజీ సర్పంచ్ వణుకురు జోజి, గన్నవరం మండలం అచ్చంపూడి గ్రామానికి చెందిన దుడ్ల నాగేశ్వరరావులకు రూ.2.50 లక్షలు చొప్పున కుటుంబ సభ్యులకు అందజేశారు.

15లోగా రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

ప్రజాశక్తి-పామర్రు: మండల పరిధిలోని రైతులు ఆగస్టు 15వ తేదీ లోపు పంట బీమా ప్రీమియమును చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి తెలిపారు. మంగళవారం ఝుజ్జవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన గురించి వివరించారు. బ్యాంకులో రుణం పొందిన రైతులు ప్రీమియం మొత్తం అదే బ్యాంకులో చెల్లించాలన్నారు.బ్యాంకులో రుణం పొందని రైతులు వరి పంటకు ఎకరంకు 830 రూపాయల చొప్పున మీసేవ కేంద్రంలో లేదా సచివాలయంలో ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. అందుకు పంట నమోదు పత్రం,ఆధార్ కార్డు,పొలం పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకొని వెళ్లాలన్నారు. ఆగస్టు 15వ తేదీలోపు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వరిలో కలుపు నివారణ సమర్థవంతంగా చేసుకోవాలని అదేవిధంగా ఎరువుల యాజమాన్యం పద్ధతిని ఆచరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది మమత గ్రామ రైతులు పాల్గొన్నారు.




యూరియా పంపిణీ చేయాలని నిరసన

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: రైతులు పంట పండించడానికి యూరియా అందించలేకపోవడం సిగ్గుచేటని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరి శివ నాగేంద్రం అన్నారు. రైతులకు యూరియా అందడం లేదని మంగళవారం రైతులు కౌలు రైతులతో కలిసి తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి రైతులకు పంటలు పండించేందుకు యూరియా దొరకడం లేదని, రైతు భరోసా కేంద్రాల ఎదుట రైతులు గంటల తరబడి క్యూలో నిలుచున్నప్పటికీ ఒక బస్తా యూరియా కూడా దొరకటం లేదన్నారు. ఇదే అదునుగా దళారులు రూ.260 ఉన్న యూరియా బస్తాని రూ.350 వరకు అమ్మి రైతులను దోచుకుంటున్నారన్నారు. ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు చూస్తూ ఉండిపోవడం తప్ప రైతులకు చేయి అందించే స్థితిలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొండల బాబు, జుజ్జువరపు యోసేపు, అంబటి శ్రీనివాసరావు, డేవిడ్ రాజు పాల్గొన్నారు.

వంద మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం తెంపల్లి గ్రామ మాజీ సర్పంచ్, సిపిఎం నాయకులు గొంగటి వీర్రాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన స్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన గుండె వైద్య నిపుణులు సత్య వర్ధన్ రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఈసీజీ తీయించారు. విజయవాడకు చెందిన శారా ఐ కేర్‌కు చెందిన డాక్టర్ బాలాజీ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్య వర్ధన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆహారపు అలవాట్లలో మార్పులు రావడం వల్ల గుండె జబ్బులు వస్తున్నాయని, వ్యాయామం లేకపోవడం వల్ల గుండెకు ఇబ్బంది కలుగుతుందని అందువల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం జరిగిన వైద్య శిబిరంలో వంద మంది సేవలను ఉపయోగించుకున్నారు.



కోర్టులో స్టాంపుల చోరీ కేసు నిందితుడు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన స్టాంపుల చోరీ కేసులో ప్రధాన నిందితుడు వడ్లమూడి చెన్నారావును మంగళవారం అంబులెన్స్‌లో గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. గన్నవరం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసే సమయంలో బైక్‌పై పారిపోవడానికి ప్రయత్నించగా కిందపడి కాలు ఫ్రాక్చర్ అయ్యింది. దీనితో అతన్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా కిడ్నీ సమస్య బయటపడింది. చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేయడంతో అంబులెన్స్‌లో తీసుకొచ్చి గన్నవరం కోర్టు ఎదుట పోలీసులు హాజరుపరిచారు. అతనికి పూర్తిగా చికిత్స ముగిసిన తర్వాత మళ్లీ కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి ఆదేశించారు.

నేటి నుండి విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-పామర్రు: పామర్రు పట్టణం గుడివాడ రోడ్‌లోని చాట్లవానిపురం, సాయినగర్, కొండిపరు రోడ్డు, బాబూజీ పేట, శివాలయం వీధి ప్రాంతాలలో రెండు ఈ నెల 30, 31 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పామర్రు గుడివాడ జాతీయ రహదారి ప్రక్కన క్రొత్తగా వేసిన33/11 కెవి విద్యుత్తు లైను కలుపుతున్న కారణంగా అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శత జయంతి ఉత్సవాల లోగో ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాల లోగోను ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణంరాజు మంగళవారం హైదరాబాదులో ఆవిష్కరించారు. ఆగస్టు 4వ తేదీ నుంచి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి ఉత్సవాలు ఏడాది పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ విస్తత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ మండలి వెంకటకృష్ణారావు పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే దివిసీమ ఉప్పెన సహాయక చర్యలు ప్రపంచ తెలుగు మహాసభలకు ఈ లోగోలో స్థానం కల్పించారన్నారు.



మోడ్రన్ పెంటథ్లాన్ ఓవరాల్ ఛాంప్ కృష్ణాజిల్లా



ప్రజాశక్తి-గన్నవరం: ఈ నెల 26, 27 తేదీల్లో విజయవాడ పెనమలూరు బ్లూమింగ్ డెల్ ఇంటర్నేషనల్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటథ్లాన్ పోటీలలో కృష్ణాజిల్లా క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించినట్లు కృష్ణాజిల్లా మోడ్రన్ పెంటథ్లాన్ సంఘం ప్రధాన కార్యదర్శి మరీదు నరేంద్రబాబు మంగళవారం తెలిపారు. 26వ తేదీన టెట్రాథ్లాన్ (ఫెన్సింగ్, స్విమ్మింగ్,రన్నింగ్, షూటింగ్) 27వ తేదీన ట్రైయాథిల్ (స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్) క్రీడాంశాలలో పోటీలను నిర్వహించగా అన్ని ఈవెంట్లలో కష్ణాజిల్లా ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 27 పథకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ సాధించిన క్రీడాకారులను ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.పి.రావు, సంయుక్త కార్యదర్శి ధనియాల నాగరాజు, రాష్ట్ర మోడ్రన్ పెంటథ్లాన్ అధ్యక్షులు వెలగపూడి ఉజ్వల్, ఎపి వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఆర్.సీజర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జి.విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులు కె.కృష్ణమోహన్, కోశాధికారి పి.సాయికుమార్ అభినందనలు తెలిపారు.

అన్న క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి : విఎంసి కమిషనర్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : అన్న కాంటీన్లను నిరం తరం పర్య వేక్షిస్తూ నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలను అందించేలా తగు చర్యలు తీసుకోవాలని విజయ వాడ నగరపాలక సంస్థ కమిషనర్



ధ్యానచంద్ర హెచ్ఎం కార్పొరేషన్ సిబ్బందికి సూచించారు. మంగళవారం తన పర్యటనలో భాగంగా హెచ్‌బి కాలనీ, ప్రియదర్శిని కాలనీ, క్రాంబే రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెచ్ బి కాలనీలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఆయన, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. అన్న క్యాంటీన్లో నుండి వచ్చే వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేయాలని, తాగునీటి, వాడుకనీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. ఆహారంలో నాణ్యత, సమయపాలన కచ్చితంగా ఉండాలని, నోడల్ ఆఫీసర్లు నిత్యం పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటుపల్లి పంచాయతీలో జిల్లా పరిషత్ సిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : గుంటుపల్లి గ్రామ పంచాయతీని జిల్లా పరిషత్ సిఇఒ కె.కన్నప్ప నాయుడు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ఇన్స్పెక్షన్ లో భాగంగా ఇంటింటికి చెత్త సేకరణ విధానం, ఎస్ డబ్ల్యూ పిసీ షెడ్డులో వర్మీకంపోస్టు ఫిట్స్,



గ్రామస్తులతో చెత్త సేకరణ గురించి అడుగుతున్న అధికారులు

ప్లాస్టిక్ షట్టర్ పని తీరు, డ్రై వేస్ట్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. ఓఎమ్ ఎస్ఆర్ ట్యాంక్ సందర్శించి క్లోరినేషన్ విధానాన్ని పరిశీలించారు. ఎంపీ లాండ్స్ నిధుల నుండి గ్రామపంచాయతీకి వచ్చిన కొత్త ట్రాక్టర్‌ను పరిశీలించారు. ఎంపీడీవో సునీత శర్మ, డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, పంచాయతీ ఇఒ కె.మురళీమోహన్, సచివాలయసిబ్బంది పాల్గొన్నారు.



జి కొండూరు పిఎస్‌కు బారికేడ్లు వితరణ

ప్రజాశక్తి - జి. కొండూరు : మండల పరిధిలో కడియపోతావరం గల నాగార్జున సిమెంట్స్ ఇండస్ట్రీ వారు మూడు లక్షల విలువగల 40 బారికేడ్లను మంగళవారం జి.కొండూరు పోలీస్ స్టేషన్‌కు వితరణ చేశారు. మండల పరిధిలో గల నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు నివారణ నిమిత్తం ఈ బారికేడ్లను నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ వారు అందజేసినట్లు జి కొండూరు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సిమెంట్స్ టెక్నికల్ హెడ్ ఆర్ఎస్ఎన్ రాజు, హెచ్ ఆర్ హెడ్ ఎమ్ ఎస్ అజర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు, ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని షేర్ మహమ్మద్ పేట, ఆటోనగర ఇండస్ట్రియల్ ఏరియా పరిదిలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆర్‌డిఎస్ వర్క్‌లో భాగంగా న్యూ ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి వైర్లు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని వినియోగదారులు సహకరించాలని మండల విద్యుత్ ఏఈ రమేష్ బాబు తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మే దుకాణాలను మంగళవారం నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలో గ్రోమోర్ కంపెనీ, శ్రీ ప్రియా ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్, సీడ్స్ దుకాణాలను ఆర్.డి.ఓ కె బాలకృష్ణ తనిఖీలు చేపట్టారు. దుకాణంలో స్టాక్ పాయింట్‌ని, షాపు రెన్యువల్, ఈ పాస్ రికార్డులను తనిఖీ చేశారు. గ్రోమోర్ కంపెనీలో ఈ పాస్ లో అరటన్ను తేడాను గమనించారు. దానికి సంబంధించిన ఈ రోజు స్టాక్ అమ్మకం ఎంట్రీ చేయకపోవడంతో తేడా ఉన్నట్లు వెంటనే వాటిని కూడా ఈ పాస్ లో ఎక్కించాలన్నారు. శ్రీ ప్రియా ఫర్టిలైజర్స్ షాపులో కొన్ని కంపెనీలకు సంబంధించి అమెన్మెంట్ రెన్యువల్ లేకపోవడంతో వారిపై ఆయన ఆగ్రహించారు. ప్రతి ఫర్టిలైజర్స్ షాపులో డిఏపి, యూరియా కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. వేరొకటి కొంటే డిఏపి, యూరియా అమ్ముతామని తెలియజేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కృత్రిమ కొరతను సృష్టించి రైతులను ఇబ్బందులు గురిచేస్తే, అధిక ధరలతో అమ్మితే సహించేది లేదన్నారు. ఈ సంవత్సరం నుండి పర్యావరణం మరియు ప్రజల ఆరోగ్యాలను కాపాడటానికి 12శాతం నానో యూరియాను ఖచ్చితంగా రైతులకు అవగాహన కల్పించి అమ్మాలన్నారు. రైతులను ఇబ్బందులు గురిచేస్తే కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్ ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఏడిఏ సి భవాని, మండల వ్యవసాయ అధికారి ఎం వరలక్ష్మి, జగ్గయ్యపేట ఆర్ఐ సూరమ్మ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో పరిశీలన



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను విజయవాడ జోన్ టు డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ తనిఖీ చేశారు. రెండు రోజులు జరిగిన ఈ తనిఖీలు బస్సుల వెహికల్ కండిషన్ మెరుగుపరిచేందుకు కావలసిన మెటీరియల్ గురించి వాకబ్ చేశారు. వెహికల్ పరిశుభ్రత గ్యారేజీలో సిబ్బందికి తగు సూచనలు చేశారు. జీరో బ్రేక్ డౌన్ సాధించేందుకు పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. రెండో రోజు గ్యారేజ్‌కి సంబంధించిన రికార్డులు పరిశీలన, మెయింటెనెన్స్ అయిన వెహికల్‌ను రోడ్ బెస్ట్ జరిపించి గేటు మీటింగ్ ద్వారా సిబ్బందితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన మహిళల ఉచిత బస్సు ప్రయాణం అమలుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎం వికాస్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ నందు పీఎం వికాస్ భారత్ రోజ్గార్ యోజన కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని ఇపిఎఫ్ ప్రాంతీయ కమిషనర్ ప్రభు దత్త పుస్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం వారు నూతనంగా ఉపాధి కల్పనను పెంచుట కొరకు ఆగస్టు 2025 నుంచి కొత్తగా ఎవరైతే నూతన యుఏఎన్ నెంబరు తీసుకుంటారో వారు ఆరు నెలలు పని కొనసాగించి నట్లయితే ఒక నెల వేతనం నగదు ప్రోత్సాహంగా వారి ఎకౌంటులో రెండు దఫాలు వేస్తారన్నారు. యాజమాన్యానికి కూడా నెలకు ఒక్కొక్క కార్మికునికి రూ.వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహంగా వేస్తారన్నారు. ఇది నూతనంగా ఉపాధి కల్పన పెంచడానికి భారత ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రారంభిస్తున్నారన్నారు. నూతనంగా ఉపాధి కల్పన ఏర్పడిన వారు వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఓ అండ్ యమ్, డా. యన్. టి. టి .పి. యస్. పి. శివ రామాంజనేయులు, పర్యవేక్షణ ఇంజనీర్ నాగేశ్వరావు, ఫ్యాక్టరీ మేనేజర్ శేషాద్రి శేఖర్, ఈపీఎఫ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫీసర్ విజయకుమార్, కార్మికులు, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి వడ్లమూడి జయంతి

ప్రజాశక్తి - నందిగామ : ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించేలా ప్రజా కళాకారులు ప్రజల్ని జాగృతపరచాలని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో 'ప్రజాకవి' వడ్లమూడి నాగేశ్వరరావు 101 వ జయంతి సీనియర్ కళాకారుడు దామోదర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ప్రజానాట్య మండలి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటూ ప్రజాకళలు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా ప్రజానీకాన్ని చైతన్య పరచటానికి దోహదపడాలన్నారు. తొలుత 'అర్జెంటు కవి' వడ్లమూడి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దామోదర్ కన్వీనర్‌గా ఏడుగురితో ప్రజానాట్యమండలి నందిగామ మండల కన్వీనింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోపాల్. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.గోపి నాయక్ పాల్గొన్నారు. **తిరువూరు :** ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు వడ్లమూ డి నాగేశ్వ రరావు జయంతి తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రజానాట్య మండలి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు.



నందిగామలో నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



తిరువూరులో...

ముమ్మరంగా వరి నాట్లు



ప్రజాశక్తి - మైలవరం : మైలవరం నియోజకవర్గంలోని మండలాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లటంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. దీంతో చెరువులు కింద ఉన్న మాగాణి పొలాలను దమ్ము చేసి వరి నాట్లు వేస్తున్నారు. పలు గ్రామాల్లో నార్లు పెంచిన రైతులు వరినాట్లు పూర్తి చేస్తున్నారు. నెల రోజుల కిందటే కొందరు వరి ఎదపెట్టే పద్ధతి ద్వారా వరి విత్తనాలు చల్లారు. మైలవరం మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో 2,400 ఎకరాల్లో వరి సాగవుతుండగా ప్రస్తుతం 449 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయినట్లు మండల వ్యవసాయ అధికారి సంధ్యారాణి తెలిపారు. మైలవరం మండలంతో పాటు రెడ్డిగూడెం, మండలంలో సగానికి పైగానే వరి నాట్లు పూర్తయ్యాయి. నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో సాధారణ విస్తీర్ణం 25 వేల ఎకరాలు ఉండగా సుమారు 3 వేల ఎకరాలకు పైగానే వరి నాట్లు పూర్తయినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

విద్యార్థులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని మిట్టగూడెంలో గల జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన 52 మంది విద్యార్థినులకు యూనిఫారాలను జగ్గయ్యపేట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా బహుకరించారు. విద్యార్థులకు శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ప్రత్యేక అతిథిగా పాల్గొని విద్యార్థులకు యూనిఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ "ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు విద్యలో ప్రోత్సాహం లభించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావు, కౌన్సిలర్ గొట్టే నాగరాజు, గింజుపల్లి కష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో రాళ్లచెరువు కట్ట

ప్రజాశక్తి - గంపలగూడెం : వినగడప రాళ్లచెరువు కట్టకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మద్ది రెడ్డి వెంకట రెడ్డి కోరారు. గత ఏడాది వర్షాలకు కట్ట తెగిపోగా, మరమ్మత్తులు దృఢమైన స్థాయిలో చేపట్టలేదని ఆరోపించారు. ఈ ఏడాది వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఆ కట్ట సగం వరకు కొట్టుకు పోయిందన్నారు. వేసిన పంటలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలంటే చెరువు కట్టకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని మద్దిరెడ్డి కోరారు.

దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో మెటర్నటీ అండ్ చైల్డ్ హెల్త్ మాసోత్సవాల సందర్భంగా వన్‌టౌన్ కొత్తపేటలోని షేక్ రాజా సాహెబ్ ప్రసూతి వైద్యశాలలో సుమారు 50 మంది తల్లి పిల్లలకు గర్భవతులకు ఉచితంగా దోమతెరలతో పాటు పాలసీసాలు, బేబీ మ్యాట్లను మంగళవారం పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ సంస్థవారు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షులు బాలగోపాలు, సెక్రెటరీ మల్పూరి రామ్ గోపాల్ రావు, కోశాధికారి భాను ప్రకాష్, కమిటీ సర్వీస్ డైరెక్టర్లు ప్రసాద్, సిహెచ్.నారాయణ, పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి వీడ్కోలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని 9వ సచివాలయంలో బదిలీలో భాగంగా వేరే సచివాలయాలకు వెళ్లిన సచివాలయ సిబ్బందిని గతవారం 19వ వార్డు కౌన్సిలర్ నూకల సాంబశివరావు కలిసి అభినందించి ఘనంగా వీడ్కోలు పలికారు. సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి ఎల్‌ఒసి అందజేత

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 50వ డివిజన్ గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన బాలుడు గొర్తి హేమ సాయికి ఎమ్మెల్యే కార్యాలయ కార్య దర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి ఎల్‌ఒసి అందజేశారు. కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు.

గ్రామీణ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్

జాతీయ చిన్న తరహా పరిశ్రమ సంస్థ చైర్మన్ రామారావు



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పత్తి చేయబడి అత్యంత నాణ్యవంతమైన వస్తువులుగా చలామణి అవుతున్న వాటికి ప్రపంచ స్థాయి మార్కెట్ కల్పించడానికి హస్త కళాకారులకు అండగా ఉంటున్నట్లు జాతీయ చిన్న తరహా పరిశ్రమ సంస్థ చైర్మన్ రామారావు పేర్కొన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్, రోల్డ్ గోల్డ్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం ఆర్కే కన్వెన్షన్‌లో పెడన కలంకారి మచిలీపట్నం రోల్డ్ గోల్డ్, నరసాపురం అల్లికలు బుట్ట బొమ్మల ఉత్పత్తుల ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌డిసి విధానంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉత్పత్తిదారులు వారి వ్యాపారాన్ని అంచలంచెలుగా అభివృద్ధి చేసుకునేందుకు మూడేళ్ల పాటు జాతీయ చిన్న తరహా పరిశ్రమ సంస్థ సహకారం అందిస్తుందన్నారు. కృష్ణాజిల్లా హ్యాండీక్రాఫ్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 48 వేల మంది హస్త కళాకారులు తమ శాఖ పరిధిలో నమోదు కాబడి గుర్తింపు కార్డులు పొంది ఉన్నారన్నారు వారికి శిక్షణ ఇస్తూ వారి ఉత్పత్తులు అమ్మకం కోసం ఎక్స్‌పోలు నిర్వహిస్తున్నామన్నారు. కృష్ణాజిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకటరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ ఒక పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి అన్ని రకాల వనరులు ఉన్నాయన్నారు. ప్రతి వ్యాపారవేత్తకు యూనిట్లు నెలకొల్పడానికి అన్ని సదుపాయాలు కల్పించేందుకు ప్రాముఖ్యత ఇస్తామన్నారు. ఎవరైనా పరిశ్రమలు నెలకొల్పాలంటే ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చో ఎంపిక చేసుకునేందుకు, భూమి కేటాయించేందుకు, అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు తమ కార్యాలయం అన్ని విధాల సహకరిస్తుందన్నారు. అంతేకాకుండా పరిశ్రమలు ఏర్పాటు చేశాక కావలసిన మార్కెటింగ్ సౌకర్యాలకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ టిట్కో అధికారి సుధీర్ కుమార్, ఏపీ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మచిలీపట్నం రోల్డ్ గోల్డ్ ఇమిటేషన్ జ్యువలరీ ప్రతినిధి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌ను ప్రారంభించాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

మహిళల కోసం దాతలు సమకూర్చిన జిమ్‌ను సత్వరమే ప్రారంభించాలని మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ డిమాండ్ చేశారు. మచిలీపట్నం నగర కార్పొరేషన్ మెయిన్ పార్కులో హైదరాబాద్ దివిస్ లేబరేటరీ లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన మహిళ జిమ్ పరికరాలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాతలు ముందుకు వచ్చినా అధికారులు, పాలకవర్గం స్పందించకపోవడం దారుణమన్నారు. పార్కుకు వచ్చే సందర్శకులు చేస్తున్న విమర్శలు అధికారులకు వినపడటం లేదా అని ప్రశ్నించారు.

తాగునీరు అందించాలని వినతి



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: మండలంలోని చంద్రాల శివారు సింగలూరు గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆ గ్రామస్తులు మంగళవారం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్ కుమార్ నాయకత్వాన ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్‌కు వినతిపత్రాన్ని అందించారు. గ్రామంలోని పంచాయతీ మంచినీటి చెరువుకు రక్షణ లేక పశువులు దిగుతున్నాయని చెప్పారు. ఆ చెరువుకు అధికారులు సర్వే చేయించినట్లు పేర్కొన్నారు. ఆ చెరువుకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గతంలో బోదె నుంచి కాకుండా కొత్తగా తాగునీటిని చెరువుకు వేరే బోదె నుంచి పంచాయతీ అందిస్తుందని తెలిపారు. ఈ బోదెలో పొలం నుంచి వచ్చే మురుగు నీరంతా కలుస్తుందన్నారు. ఆ కారణంగా మంచినీరు కలుషితమై చెరువులోకి చేరుతుందన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకుని తమ గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఉద్దంటి నాగ మలేశ్వరరావు, మాచర్ల రమణయ్య, తుమ్మలచర్ల లక్ష్మణరావు, బిట్రా అర్జునరావు, కోట పైడేశ్వరరావు, దోనేపూడి ప్రసాద్, ఆకురాతి హనుమంతరావు, నెమలి రాజా, నందం రమణ, మాచర్ల పెద్దిరాజులు, ఆకురాతి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-పామర్రు: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది ముగిసిన సందర్భంగా గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి అక్కడ ప్రజల నుండి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండల పరిధి జమీగొల్వేపల్లి గ్రామంలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్లూరుపల్లి గణేష్, జన్ను శోభన్ బాబు, కుదరవల్లి ప్రవీణ్ పాల్గొన్నారు. **అవనిగడ్డ:** వేకనూరు, రామకోటిపురం గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం సాయంత్రం వేకనూరు డివైదాస్ కాలనీలో టిడిపి మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రామకోటిపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బండే రాఘవ, షేక్ బాబావాలి, మండలి రామ్మోహన్రావు పాల్గొన్నారు.



కిటకిటలాడిన మోపిదేవి ఆలయం

ప్రజాశక్తి-మోపిదేవి: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం శ్రావణమాసం మంగళవారం నాగ పంచమిని పురస్కరించుకుని యాత్రికులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుండి వేకువ జామునే వచ్చిన యాత్రికులు స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకుని, స్వామివారి నాగపుట్టలో పాలు పోశారు. అక్షరాభ్యాసం, నామకరణం, అన్నప్రాసన, పాల పొంగళ్లు, వాహన తదితర పూజలు నిర్వహించారు. నాగ పంచమి పురస్కరించుకుని శ్రావణమాసం మంగళవారం కావడంతో యాత్రికులు పెద్ద సంఖ్యలో రావడంతో స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.14 లక్షలు వచ్చాయని ఆలయ అధికారులు తెలిపారు. విరాళాలు రూ.1.82 లక్షలు వచ్చాయి. ఐదు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

మొవ్వ ఎంపిడిఒగా శ్రీనివాసరావు



ప్రజాశక్తి-మొవ్వ: మొవ్వ ఎంపిడిఒగా నూతలపాటి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎంపీడీవో దయాల సుహాసిని బాపట్లలో నెల రోజులు పాటు నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరవటంతో శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు.

రేపు సీజర్‌రెడ్డి ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-గన్నవరం: క్రీడా సేవకుడు ఆర్.సీజర్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం ఈ నెల 31న సాయంత్రం నాలుగు గంటలకు జి.కొండూరు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి ధనియాల నాగరాజు తెలిపారు. రాష్ట్రంలోని ఎంతో మంది బాలబాలికలను ఉత్తమ క్రీడాకారులుగా తన విధి నిర్వాహణలో తీర్చిదిద్దిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సీజర్‌రెడ్డి అని నాగరాజు తెలిపారు. అంతేకాకుండా నిరుపేద క్రీడాకారులు ఆర్థిక పరిస్థితి కారణంగా క్రీడల్లో పాల్గొనలేని పరిస్థితులలో సొంత డబ్బులు అందించి ప్రోత్సహించిన క్రీడా సేవకులు సీజర్‌రెడ్డి అని పేర్కొన్నారు.

రూ.8 కోట్లతో అభివృద్ధి పనులు : రాము



ముస్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ పట్టణంలో రూ.8 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు గుడివాడ సమగ్ర అభ్యున్నతే తన లక్ష్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం ప్రజా వేదికలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో శానిటేషన్ మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలు, సురక్షిత త్రాగునీటి సరఫరా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో తీసుకోవలసిన చర్యలపై మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ఇటీవల మంజూరైన క్రిటికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం నిధులు రూ.8 కోట్లతో పట్టణంలో చేయనున్న అభివద్ధి పనులను ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ పట్టణ అభివద్ధికి 8 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఆ నిధులతో గుడివాడ పట్టణంలో రూ.3.18 కోట్లతో రోడ్లు, రూ.3.25 కోట్లతో డ్రైన్లు, రూ.1.17 కోట్లతో పార్కులు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రూ.40 లక్షల నిధులతో టిడ్కో కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి బోర్లు వేయనున్నట్లు చెప్పారు. సాంకేతిక అనుమతుల కోసం ఇప్పటికే సిఆర్డిఏకు పంపామన్నారు. అనుమతులు మంజూరైన మూడు వారాల్లోపుగానే అభివృద్ధి పనులన్నీ ప్రారంభమవుతాయన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎంఈ ప్రసాద్, డిఇలు సతీష్ చంద్ర, వరప్రసాద్, శివాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్ రమేష్

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్: మత్తు పదార్థాలు, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు విద్యార్థులు అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోవద్దని మచిలీపట్నం సబ్ జైల్ సూపరిండెంట్ పి.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం పోర్ట్ రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాలు, ర్యాగింగ్,పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల 30 సంవత్సరాల్లోపు యువత నేరాలు చేసి జైలు పాలవుతున్న సంఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరం అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు లోనైనవారు చట్టరీత్యా శిక్షార్హులు అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు, జీవిత బీమా ఉద్యోగుల సంఘం కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ర్యాగింగ్ పెనుభూతానికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఆశయంతో ముందుకు సాగి ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు హసీం బేగ్, పి.వి.ఫణి కుమార్, ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ వెలివెంటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుండి మూడు గ్రామాల్లో రీ సర్వే

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఈ నెల 31 నుండి రెండు రోజులు పాటు మండలంలోని మూడు గ్రామాల్లో మూడో విడత భూముల రీ సర్వే చేపట్టనున్నటు తాసిల్దార్ సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కాటూరు, కలవపాముల, ముదునూరు గ్రామాల్లో ఈ సర్వే నిర్వహించి భూహక్కుదారుల్ని నిర్ణయిస్తామని, గ్రామసభల ద్వారా ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దులు, వ్యవసాయ భూములు వాటి వివరాలు ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. 31వ తేదీ ఉదయం కాటూరు గ్రామంలోనూ మధ్యాహ్నం కలవపాముల గ్రామంలోనూ ఆగస్టు ఒకటిన కాటూరు గ్రామంలోనూ ఈ సర్వే ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.

పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ రూరల్ మండల పరిధిలోని మల్లాయిపాలెంలో గుడివాడ తాలూకా పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. గుడివాడ రూరల్ సిఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై చంటిబాబుతో కలిసి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామ ప్రజలకు ధైర్యం కలిగే విధంగా ఉండాలన్నారు. ఏదైన సమస్య వచ్చినప్పుడు పోలీసులకు ఫోన్ చేయాలని, గ్రామంలో ఎంటువంటి అసాంఘీక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో గంజాయి సేవించి, మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలని వినతి



ప్రజాశక్తి-బంటుమిల్లి: ఎరువులు కొరత లేకుండా చూడాలని తహశీల్దార్ కాగిత పూర్ణచంద్రరావుకు రైతులు వినతిపత్రం అందజేశారు. సార్వా పంట వరి సాగు ప్రారంభమై దాదాపు నెల దాటుతున్నా ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నానో లిక్విడ్ యూరియా డిఏపి ఎరువులు మందుల షాపుల్లో బలవంతంగా అంటకడుతున్నారని పేర్కొన్నారు. ప్రాథమిక సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, సుజ్ఞానం, జనార్ధన్‌రావు, లంకదాసుల శివరాం ప్రసాద్, పొదిలి వెంకన్న, సిపిఎం మండల కార్యదర్శి శివ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాధవీలత

సురక్షిత ఆహారమే లక్ష్యం

ప్రజాశక్తి - మైలవరం : పంటల్లో వైవిధ్యాన్ని పెంచి ఆరోగ్య, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే ప్రజల భాగస్వామ్యంతో సహజసిద్ధమైన వ్యవసాయం (కమ్యూనిటీ మేనేజడ్ న్యాచురల్ ఫార్మింగ్) పథకం లక్ష్యమని ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో సబ్ డివిజన్ పరిధిలోని మైలవరం, జి.కొండూరు మండల విఎఎలు, విహెచ్ఎలు, ఎఇఒలు, ఎంపిఇఒలకు మూడు రోజులు పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయం సార్వత్రిక సూత్రాల గురించి వివరించారు. ఎడిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ నవధాన్యాల విధానంలో ఏడాది పాటు భూమి నిరంతరం కప్పబడి ఉంటుందని దీనివల్ల నేల గుల్ల, భారీ వానపాములు వృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మోడల్ మేకర్ ట్రైనర్ శాంతకుమారి, కె.రమాదేవి, ఎటిఎం మోడల్, ఎ.గ్రేడ్ మోడల్ గురించి వీడియో ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి, ఉద్యాన శాఖ అధికారి సోహైల్ అహ్మద్, ఏవో టెక్నికల్ ఆర్ వాసుదేవ్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు పెన్షన్లు పునరుద్ధరించాలి : కమల

ప్రజాశక్తి - వత్సవాయి : ఆశ వర్కర్లకు వితంతు ఒంటరి మహిళ పెన్షన్లు పునరుద్ధరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ కమల డిమాండ్ చేశారు.



ఆశ వర్కర్ల వత్సవాయి మండల మహాసభ జి నాగేశ్వరి అధ్యక్షతన బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమలా మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ,పెన్షన్ వంటి కనీస సౌకర్యాలు కూడా లేవని, వారికి ఇచ్చేది గౌరవ వేతనం మాత్రమేనని ఆమె అన్నారు. అనంతరం 14 మందితో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలుగా జి.నాగేశ్వరి, కార్యదర్శిగా కె.శ్రీలక్ష్మి, కోశాధికారి డి.సైదమ్మతో పాటు విమల, రాజేశ్వరి, వెంకటరమణ, సుజాత, సౌజన్య, ఉమా, కిరణ్ కుమారి, శైలజ, సునీత, పద్మ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సిఐటియు మండల కార్యదర్శి రాము, సిఐటియు నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షన్ బృందం పర్యటన

ప్రజాశక్తి జగ్గయ్యపేట: గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షన్ 2025 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని చిల్లకల్లు, బండిపాలెం, గండ్రాయి గ్రామాలను జిల్లా బృందం పరిశీలించింది. దీనిలో భాగంగా గండ్రాయి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రం, గ్రామంలోని వీధులను వచ్చిన బృందం తనిఖీ చేసింది. టాయిలెట్ల వినియోగం, తాగునీటి వసతి, గ్రామంలోని అంతర్గత రహదారులు, పరిశుభ్రత, తడిచెత్త, పొడిచెత్త సేకరణ, ప్లాస్టిక్ వాడకం నిషేధం, నారసంచులను ఉపయోగించటం మొదలగు అంశాలను పరిశీలించారు. స్వచ్ఛసర్వేక్షన్ కార్యక్రమం లోని ముఖ్య అంశాలపై ప్రభుత్వంలో పనిచేస్తున్న వివిధ అధికారులు, ఉద్యోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచినలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ రాఘవన్, జిల్లా పంచాయతిరాజ్ రీసోర్స్ కో ఆర్డినేటర్ నాగేశ్వరమ్మ, ఎంపీడీవో జి.నితిన్, అసిస్టెంట్ ఎంపిడిఒ పద్మావతి, డిఎల్‌పిఒ ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ అప్పారావు, సర్పంచ్ లూర్థుమేరి, గ్రామ శెక్రటరీ సంధ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది. పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ పద్ధతితో అధిక దిగుబడి

ప్రజాశక్తి - చందర్లపాడు : నందిగామ డివిజన్ పరిధిలో ఉన్న చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతు వసంత కోటేశ్వరరావు తనకున్న 10 ఎకరాల వరి పొలంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి నాటారు. ఇదే పొలంలో పిఎమ్‌డిఎస్ ఏడు రకాల విత్తనాలను కూడా వెదజల్లారు. ఉలవలు, పెసర, మినుములు, బొబ్బర్లు, నువ్వులు, తోటకూర, ఆలపుర ఈ ఏడు రకాల విత్తనాలు కూడా వేశారు. దీనివల్ల భూమి సారవంతమై అదేవిధంగా ప్రధాన పంట అయిన వరి పంటలో మంచి దిగుబడి వస్తాయని రైతులకు అవగాహన కల్పించడంతో చాలామంది రైతులు ఈ వరిలో డ్రమ్ సీడర్ పద్ధతిలో ఏడు రకాల పిఎమ్‌డిఎస్ పద్ధతిలో బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు. ఈ కార్యక్రమానికి డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ వై.శంకర్ నాయక్, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఎ అంజిరెడ్డి, డిఎంఎంటి కె.ఎస్.శ్రీనివాస్ నాయక్, ఈ కార్యక్రమానికి హాజరై రైతులకు అనేక సూచనలు సలహాలిచ్చారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై.శంకర్ నాయక్ ఈ డ్రమ్ సీడర్ పద్ధతిలో రైతులు వరి విత్తనాలతో పాటు పిఎండిఎస్ ఏడు రకాల విత్తనాలు కూడా వేసుకోవడం వల్ల భూమిలో సారం పెరిగి ప్రధాన పంట అయిన వరి పంట కూడా బాగుంటుందని తెలిపారు. భూమి గుల్లబారి సారవంతంగా


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

తయారవుతుందని దాని వల్ల మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని ఈ పద్ధతిలో భూమితో పాటు రైతుకు కూడా మంచి దిగుబడిని ఇస్తుందని రైతులకు వివరించారు. అంజిరెడ్డి మండల పరిధిలో మొత్తం 1140 మంది రైతులకు గాను 939 మంది రైతులు ఈ ప్రకతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్నారని ఈ మండల పరిధిలో ప్రధానంగా పత్తితో పాటు వరి పంట కూడా సాగు చేస్తున్నారని మొత్తం 1041.50 ఎకరాల్లో ఇప్పటికే పిఎండిఎస్ వేశారని, తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రకృతి వ్యవసాయ శాఖ నుండి డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ వై.శంకర్ నాయక్ ఎన్ఎఫ్ఎ అంజి రెడ్డి, డిస్టిక్ ట్రైనర్స్ బెంజిమెన్, శ్రీనివాస్ ఐసిఆర్‌పిఎస్ మండలంకర్ సుధాకర్, ఎల్.మైసమ్మ, సిబ్బంది హాజంయ్యారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - తిరువూరు : రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించే ప్రకృతి వ్యవసాయం సాగుచేయించాలని వ్యవసాయ అధికారులు పి.పద్మ, సాయిశ్రీ, టెక్నికల్ ఏఓ టిప్పు సుల్తాన్ క్షేత్రస్థాయి వ్యవసాయ సిబ్బందికి సూచించారు. తిరువూరు డివిజన్ పరిధిలోని మూడు మండలాలలోని అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బం దికి ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించనున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం తిరువూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యంగా పెంపొందించ బడుతుందన్నారు. 365 రోజులు వివిధ పంటలతో భూమిని కప్పి ఉంచడం వల్ల భూమిలో సూక్ష్మజీవుల లభ్యత అభివృద్ధి చెందడమే కాక భూమిలో తేమ శాతం ఉంటుందన్నారు. ఈ



సందర్భంగా రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూ టివ్ వైస్ చైర్మన్ టి.విజయ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిటీ మేనేజెడ్ ప్రకృతి వ్యవసాయంలో 9 రకాల సార్వత్రిక సూత్రాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎ.వాణి, కె.నాగేశ్వరమ్మ, కె.ప్రశాంత్, ఎం. సతీష్, వి.స్వా తి, బి.చిదంబరం పాల్గొన్నారు.

'పారామౌంట్' సందర్శన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కొనకంచి క్రాస్ రోడ్ లో గల పారామౌంట్ కర్మాగారాన్ని సందర్శించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ కార్యాలయాల పరంగా వచ్చిన ఇబ్బందులను పరిశీలించి వాటిని మరల పునరావృతం కాకుండా చూసుకుంటామని కంపెనీ యాజమాన్యానికి హామీ ఇచ్చారు. పారామౌంట్ అధినేత వెనిగళ్ళ సురేష్ కుమార్ నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలియజేశారు. మహాప్రస్థానం వాహనం ద్వారా ఉచిత అంతిమయాత్ర సేవలు, శివానంద ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు ఆహారం, 700 కుటుంబాలకు ప్రత్యక్షంగా ఉపాధి, గ్రామాలలో మినరల్ వాటర్ ప్లాంట్ లు, విపత్కర పరిస్థితులలో నియోజకవర్గానికి సహకారం, పి4 పథకం ద్వారా 27 కుటుంబాలను దత్తత తీసుకొని అభివృద్ధి చేయటం ఇలాంటి మరెన్నో కార్యక్రమాలకు నాంది పలికిన మహోన్నత వ్యక్తి సురేష్ అని ఆయన అన్నారు.

ఎన్‌టిటిపిఎస్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ నార్ల తాతారావు తాప విద్యుత్ కేంద్రంలోని బి.కాలనీ ఆడిటోరియంలో ఉచిత వైద్య శిబిరాన్ని చీఫ్ ఇంజినీర్ పి.శివ రామాంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ పి.శివ రామాంజనేయులు ప్రసంగిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం, 40 సంవత్సరాలు దాటిన వారందరు తప్పనిసరిగా ప్రతి సంవత్సరం తప్పని సరిగా వైద్యపరీక్షలు జేయించుకోవాలి, వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తచర్యలు తీసుకోవాలని తెలిపారు. మధుమేహం, బి.పి ఉన్నా వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవాలి అని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో రమేష్ హాస్పిటల్, అంకురా, స్రవంతి, హెచ్.సి.జి. కేన్సర్, అమరావతి ఐ, దుహితా డెంటల్ ఆస్పత్రుల వారి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ శిక్షణసంస్థ



బి.శ్రీధర్, పర్యవేక్షక ఇంజనీర్స్ డా.యన్.టి.టి.పి.యస్ కె.వి.నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, బాలకృష్ణ, డిప్యూటీ సెక్రటరీ పి.శ్రీదేవి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సివిల్ వాసుదేవరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సివిల్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

31, 1 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలంలోని మక్కపేటలో ఈనెల 31, ఆగస్టు 1న తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జయప్రద ఫౌండేషన్ నిర్వాహకులు టీడీ జనార్ధన్ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరికీ తెలియజేయడానికి, గ్రామ సర్పంచ్ మల్లెల శివ ప్రసాదు. స్థానిక గ్రామీణ డాక్టర్ కామినేని భూపాలరావు, ఆశా వర్కర్లు, ఇతర గ్రామ సేవకులు కలిసి, ఇంటింటికి తిరుగుతూ కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ శిబిరంలో వివిధ వైద్య సేవలు ఉచితంగా లభిస్తాయి. కావున గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని అభ్యర్థించుకుంటున్నాం.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట మండల విద్యా శాఖ పరిధిలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్‌టియు (రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం) నాయకులు మండల విద్యా శాఖాధికారికి మంగళవారం వినతి పత్రం అందించారు. మండలంలో అసంపూర్తిగా ఉన్న ఉపాధ్యాయుల సర్వీసు రిజిస్టర్లను వెంటనే అప్డేట్ చేయాలని, జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల ప్రకారం మండలంలోని ఉపాధ్యాయులు ఈ - ఫైలింగ్ చేసుకునేందుకు వీలు కల్పించడం కోసం అవసరమయ్యే టి.డి.ఎస్ (టిడిఎస్) వెంటనే పూర్తి చేయాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి యూనియన్ కో ఆర్డినేషన్ మీటింగ్ తప్పక నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట కౌన్సిలర్ టి.వి.ఎల్.నరసింహారావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి ఎం.శ్రీహరి, మండల అధ్యక్షుడు కె.రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.శ్రీనివాసరావు, మండల ఆర్థిక కార్యదర్శి బి.సైదా పాల్గొన్నారు.



వసతి గృహం సందర్శన

ప్రజాశక్తి - జి.కొండూరు : జి.కొండూరు ప్రధాన కేంద్రంలో ఉన్న సంక్షేమ హాస్టల్‌ను వైసిపి విద్యార్థి విభాగం మంగళవారం సందర్శించింది. వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, జి.కొండూరు ఎంపిపి లక్ష్మి తిరుపతమ్మతో కలిసి హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థుల మెనూ ఆరా తీశారు. మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కూటమి సర్కారు హాస్టల్ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని వసతి గృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని దుయ్యబట్టారు. కేవలం ప్రచారం తప్ప సంక్షేమం లేదని పేర్కొన్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు, విద్యుత్ భారాలపై విస్తృత ప్రచారం



చల్లపల్లిలో...

ప్రజాశక్తి-మొవ్వ: షాపులకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని, వాటి స్థానంలో పాత మీటర్లు బిగించాలని, ప్రజలపై విద్యుత్ అదనపు ఛార్జీలు వెయ్యరాదని, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కాజ గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కోదాటి నారాయణరావు, నందం వెంకటేశ్వరరావు, గౌరి సత్యప్రసాద్, కోదాటి కనకదుర్గరావు, రావులపల్లి మురహరిరెడ్డి, కొడాలి కరుణాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి:** ప్రజాసంఘాల నాయకులు మంగళవారం స్థానిక వర్తక వాణిజ్య సంఘాల సభ్యులను కలసి స్మార్ట్‌మీటర్ల బిగింపునకు వ్యతిరేకంగా ఆగస్టు 5వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సంతకాలు సేకరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు అన్నవరపు పాండురంగారావు, వరదా హరిగోపాల్, ఉపాధ్యక్షులు కొల్లిపర సాంబశివరావు, కొల్లిపర పోతురాజు (మధు), రైతు సంఘం నాయకులు హనుమాన్, సురేంద్రనాథ్ బెనర్జీ, యద్దనపూడి మధు, గోగినేని రత్తయ్య, మహమ్మద్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలని, విద్యుత్ ట్రూ అప్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి.రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉయ్యూరు పట్టణంలోని శివాలయం వీధిలో కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేసి సామాన్య మధ్యతరగతి ప్రజలపై పెను భారం మోపటానికి సిద్ధంగా ఉన్నాయని, దీనికి వ్యతిరేకంగా ఆగస్టు 5న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. **గన్నవరం:** ప్రజలను కష్టాలకు గురి చేసే స్మార్ట్ మీటర్ ఉచ్చులో పడొద్దని.. మీటర్ పెట్టేందుకు ఇంటికి వస్తే వ్యతిరేకించాలని ప్రజా వేదిక నాయకులు ప్రజలను చైతన్య పరిచారు. మండలంలోని దావాజీగూడెం రమణమ్మ చెరువులో మంగళవారం ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. స్మార్ట్ మీటర్ వల్ల కలిగే నష్టాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా వేదిక నాయకులు ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటికే షాపులకు స్మార్ట్ మీటర్లు పెట్టారని, కరెంటు బిల్లులు అధికంగా రావడంతో షాపుల యజమానులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారావు, చిన బాజీ, సిహెచ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మొవ్వలో...



ఫెర్టిలిటీ సెంటర్‌లో తనిఖీలు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో సహాయక పునరుత్పత్తి సాంకేతికత కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లాలో కామినేని, పిన్నమనేని సిద్దార్థ ఆసుపత్రులతో పాటు మచిలీపట్నంలో నవ్య ఫెర్టిలిటీ సెంటర్‌తో పాటు చల్లపల్లిలో కీర్తి హాస్పటల్ ఉన్నాయి. ఈ తనిఖీల్లో రికార్డుల నిర్వహణ, వైద్య సేవలు అందిస్తున్న తీరు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రజల విశ్వాసం పొందాలని సూచించారు. ఈ తనిఖీల్లో పలువురు ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ఈ నెల 31న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కష్ణా జిల్లా శాఖ వార్షిక సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు తెలిపారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ హాలులో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశంలో నూతన మేనేజ్మెంట్ కమిటీ ఏర్పాటు కూడా జరుగుతుందని, సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-ఉంగుటూరు: మండలంలో నిర్మాణ దశలో ఉన్న 501 మంది ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహాన్ని వివరించి ఇంటి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేసే విధంగా క్రషి చేయాలని క్రిష్ణా జిల్లా హెడ్ హౌసింగ్ అధికారి జి.పోతురాజు అన్నారు. మండల కేంద్రంలోని స్త్రీ శక్తి సమావేశ భవనం లో మంగళవారం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ సిబ్బందితో ఇళ్ల నిర్మాణంలో పురోగతి పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నకు ముఖ్య అతిధిగా హాజరైన పోతురాజు మాట్లాడుతూ ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహకారం అందుతుందని విషయాన్ని లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారికి వివరించాలని తద్వారా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేటటువంటి దానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఇ సత్య కుమార్, డిఇఇ హౌసింగ్ రమేష్ బాబు, ఇఇ హౌసింగ్ శివప్రసాద్, వెంకట్రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పరామర్శ

ప్రజాశక్తి-కంకిపాడు: కంకిపాడు ప్రభుత్వాసుపత్రిలోని రోగులను టిడిపి సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంకిపాడు ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. వయసు పైబడిన వారిలో మర్యాదగా నడుచుకుంటూ వారికి సరైన సమాచారం అందించాలన్నారు.



సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల: కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా ఉంటుందని పామరు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం గురజాడ, మంటాడ కపిలేశ్వరపురం గ్రామాల్లో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, లింగమనేని రామారావు పాల్గొన్నారు.

కళాకారుడు నాగేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-ఉయ్యూరు: ప్రజాకవి, నాటక కళాకారుడు, రచయిత వడ్లమూడి నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఉయ్యూరులోని నాగళ్ల రాజేశ్వరమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రంలో నాగేశ్వరరావు చిత్రపటానికి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివ నాగేంద్రం మాట్లాడుతూ ఆనాటి ఎమర్జెన్సీ సమయంలో నాగేశ్వరరావు జిల్లా వ్యాప్తంగా పాటలు నాటికల ద్వారా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం నింపారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.రాజేష్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కంభం కొండలబాబు, బుల్లియ్య, నృత్య కళాకారిణి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



జర్మనీలో ఉపాధి కల్పనకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): కష్ణాజిల్లా లోని బిఎస్సి నర్సింగ్ పూర్తి చేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం మరియు జీఎన్ఎమ్ నర్సింగ్ పూర్తి చేసి మూడేళ్ళ క్లినికల్ అనుభవం ఉన్న షెడ్యూల్డ్ కులము (ఎస్‌సి) మరియు షెడ్యూల్డ్ తెగలకు (ఎస్‌టి) చెందిన వయస్సు 35 సంవత్సరముల్లోపు ఉన్న మహిళలకు, జర్మన్ భాష లో శిక్షణ ఇచ్చి మరియు జర్మనీ దేశము నందు ఉపాధి అవకాశము కల్పించేందుకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యములో దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్‌సి సంక్షేమ మరియు సాధికారిత అధికారి షాహిద్ బాబు షేక్ తెలిపారు. అర్హత ఉండి మరియు ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత, అనుభవ ధవీకరణ, కుల ధ్రువీకరణతో ఆగస్టు 7వ తేదీలోగా https://nalpunyam.ap.gov.in/user-registration? page program-registration నమోదు చేసుకోవాలని లేదా skilinternational@apssdc.inకు రెస్యూమ్ ఈ మెయిల్ చేసుకోవాలన్నారు. మిగిలిన వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మచిలీపట్నం నియోజకవర్గంలోని పీఎసీఎస్‌లలో యూరియా కొరత ఉందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ పేర్ని కృష్ణమూర్తి చేసిన వ్యాఖ్యలను నియోజకవర్గ టీడీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో తెలుగు రైతు విభాగం జిల్లా అధ్యక్షులు గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కుంచే దుర్గా ప్రసాద్ (నాని), మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు,లు మాట్లాడుతూ యూరియా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్ని కిట్టు చేసిన ఆరోపణలను వారు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.పీఏసీఎస్ లలో సమద్ధిగా యూరియా నిల్వలు ఉంటే పేర్ని క్రిష్ణ మూర్తి అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కొల్లు రవీంద్ర కషితో నియోజకవర్గంలోని పీఏసీఎస్ లకు 139 టన్నుల మేర యూరియా రాగా ఇంకా 68 టన్నులు నిల్వలు ఉన్నాయన్నారు. మరో 250 టన్నులు యూరియా కూడా రానుందన్నారు. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతాంగ సమస్యలను ఏ రోజు పట్టించుకోని పేర్ని క్రిష్ణ మూర్తి నేడు రైతులపై ఎనలేని ప్రేమ ఉన్నట్టు చూపిస్తుండటం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్ లో ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలోనే అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు అందించనున్నట్టు తెలిపారు. సాగునీరు కూడా సకాలంలో అందజేసి రైతులను ఆదుకున్నామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కాశీ విశ్వనాధం, టీడీపీ నగర మాజీ ప్రధాన కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు పాల్గొన్నారు.



గుడివాడలో ఎస్‌ఎఫ్‌ఐ ప్రదర్శన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ సుందరయ్య భవనంలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా ప్లీనరీ సమావేశాల సందర్భంగా గుడివాడ పట్టణంలో మంగళవారం విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం మాట్లాడుతూ విద్యారంగంలో తీసుకువచ్చిన నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ కల్పించాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని, తల్లికి వందనం ప్రతి విద్యార్థిని విద్యార్థులకు వర్తింప చేయాలన్నారు. అలాగే డిగ్రీలో తీసుకొస్తున్న మేజర్ మైనర్ విధానాన్ని రద్దు చేయాలని, సంక్షేమ ఆస్తులకు నిధులు కేటాయించి మెస్ చార్జీలు పెంచాలని, కృష్ణా యూనివర్సిటీ హాస్టల్‌ని యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ల కోసం విద్యార్థులు ప్రదర్శన ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. దానితోపాటు విద్యారంగంలో వస్తున్న మార్పులపై ఈనెల 30వ తేదీన జరిగే చర్చల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రతినిధులతో చర్చించి సమావేశాల్లో కొన్ని తీర్మానాలు చేస్తామన్నారు. ప్రతి విద్యార్థికి ఈ కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని, ప్రభుత్వ పాఠశాలకు సంక్షేమ హాస్టళ్లకు మౌలిక వసతులు కల్పించాలని, త్రాగునీరు ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నాగేంద్ర, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు జగన్, గుడివాడ మండల కమిటీ సభ్యులు రుధీర్, పవన్, అభిలాష్, అర్జున్, తేజ, పండు, జెన్నీఫర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గుడివాడ: గుడివాడ ఆటోనగర్ 2వ రోడ్‌లో హైడ్రాలిక్ పైప్ పనిచేసి ఇంటికి వెళ్లే సందర్భంలో ప్రమాదానికి గురైన 28వ వార్డు వాంబే కాలనీకి చెందిన షేక్ రమీజ్‌కి ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ ఆటోనగర్ గుడివాడ ఆధ్వర్యంలో మంగళవారం రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు లక్ష్మణరావు, అధ్యక్షులు అబ్దుల్ హమీద్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, ఉపాధ్యక్షులు బొబ్బరపల్లి ఆంజనేయులు, కోశాధికారి ఆత్మూరి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు మేళాలో 42 రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: మచిలీపట్నం మండలం మంగినపూడి లైట్ హౌస్ దగ్గర జరిగిన పాస్పోర్ట్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్‌కు 42 మంది హాజరయినట్లు ఎంపిడిఓ సిహెచ్.వెంకటేష్ తెలిపారు. మంగళవారం మండల టీడీపీ ప్రెసిడెంట్ కాగిత వెంకటేశ్వరావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జి సోమశేఖర్ ఏర్పాట్లను సమీక్షించారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ: మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ రేపల్లె వీరరాఘవయ్య కుటుంబాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు పరామర్శించారు. ఇటీవల వీర రాఘవయ్య సతీమణి శేషు కుమారి మరణించారు. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ మంగళవారం అసుర పాలెం లోని వీరరాఘవయ్య కుటుంబం వద్దకు వెళ్లి వారిని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం శేషు కుమారి చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రేపల్లె వాసు, రేపల్లె నాగ శ్రీనివాసరావు, రేపల్లె బసవపునయ్య, గ్రామ సర్పంచ్ పి లంకమ్మ ప్రసాద్, రేపల్లె మల్లేశ్వరరావు న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ భూపతి పాల్గొన్నారు.





పిహెచ్‌డి సాధించిన ఎల్‌బిఆర్‌సిఇ అధ్యాపకునికి అభినందన

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సిఎస్ఇ) విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకులు శ్రీశ్వంత్ బొప్పూడి పిహెచ్‌డి అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విఐటి ఎపి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో 'ఎన్‌హ్యాన్సింగ్ క్రాప్ ఈల్డ్ ప్రెడిక్షన్ విత్ హైబ్రిడ్ ఇంటెలిజెన్స్ అండ్ అడ్వాన్స్ ఫ్యూచర్ సెలెక్షన్ టెక్నిక్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు పి.హెచ్.డిని ప్రధానం చేశారన్నారు. ఈ పరిశోధన షీలా జయచంద్రన్ విఐటి ఎపి యూనివర్సిటీ వారి పర్యవేక్షణలో జరిగిందన్నారు. ఈ పరిశోధన వ్యవసాయంలో ఎంత దిగుబడి వస్తుందనేది డీప్ లెర్నింగ్ ఉపయోగించి అంచనా వేయబడుతుందన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.ఎస్ నాగార్జున రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు శ్రీ.శ్వంత్ బొప్పూడిని అభినందించారు.

మహిళల చెస్ టోర్నీ విజేత శ్రేయ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : పెనమలూరు మండలం కానూరులోని శ్రీ కష్ణ రుద్ర మెడికల్ అకాడమీలో రెండు రోజులపాటు జరిగిన మహిళల చెస్ టోర్నమెంట్‌లో వేములపల్ల శ్రేయ విజేతగా నిలిచింది. మహిళల ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను పురస్కరించుకుని శ్రీకష్ణ రుద్ర మెడికల్ అకాడమీలో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మూడు పాయింట్లు సాధించి మొదటిస్థానంలో నిలిచిన వేములపల్లి శ్రేయకు పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ రూ.35 వేలు విలువైన డిజిటల్ చెస్ బోర్డును బహుమతిగా అందజేశారు. రెండు రోజులపాటు నిర్వహించిన చెస్ పోటీలకు ఔత్సాహిక చెస్ మహిళా క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ, చెస్, ఇతర మేధో క్రీడలను అభ్యసించాలని క్రీడాకారులకు సూచించారు. ఇదిలావుండగా, ఈ టోర్నమెంట్‌లో కె.హేశ్రిత రెండవ స్థానాన్ని పొందగా, వై అవిష్క, కె పావనిక సంయుక్తంగా మూడవ స్థానాన్ని పంచుకోగా, జి అన్వి నాల్గవ స్థానంలో నిలిచారు. చదరంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించినందుకు, యువ ప్రతిభలో ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తిని పెంపొందించినందుకు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడంపై పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తాడేగడప మునిసిపాలిటీ 27వ వార్డు అధ్యక్షుడు వేములపల్లి సోమశేఖర్, శ్రీ కృష్ణ రుద్ర మెడికల్ అకాడమీ డైరెక్టర్ మోదుకూరి వీరయ్య చౌదరి హాజరయ్యారు.



ఆటో, ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాలో నేతల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : ఆటో, ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అలంకార్ ధర్నా చౌక్ వద్ద మంగళవారం ఆటో, ముఠా కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఆటో, ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని కోరుతూ కార్మికులు చేసిన నినాదాలు హోరెత్తాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి పశ్చిమ సిటీ సిఐటియు కార్యదర్శి ఇవి నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్) రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు మాట్లాడుతూ ఆటో, ముఠా కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆటో, ముఠా కార్మికులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. నిత్యం అనేక ఇబ్బందుల నడుమ ఆటో, ముఠా కార్మికులు పనులు చేయాల్సి వస్తోందని అన్నారు. పోలీసులు, ఇతర అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల ఆటో, మోటార్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. డిగ్రీ, బీటెక్ వంటి



ఆటో, ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అలంకార్ ధర్నాచౌక్ సెంటర్ వద్ద ధర్నా చేఐస్తున్న దృశ్యం

చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక మోటార్ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న వారి జీవనోపాధిని కాపాడాల్సింది పోయి ఆటో, మోటార్ కార్మికుల కుటుంబాలను రోడ్లపాలు చేయటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పునరాలోచించి ఆటో , మోటార్ కార్మికుల జీవనోపాధిని కాపాడే విధంగా ఓలా, ఊబర్, ర్యాపిడో కమిషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే ఉచితంగా యాప్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బ్రేక్ చేసే పద్ధతి (ఫిట్ నెస్) ప్రభుత్వ ఆధీనంలో మ్యాన్యువల్‌గా నడపాలని కోరారు. ఆటో,ముఠా కార్మికులకు వేసే వేలాది రూపాయలు జరిమానాలను నిలిపివేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆటో,మోటార్ కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని హెచ్చరించారు. అనంతరం అదనపు రవాణా కమిషనర్ ఎల్.ఎస్.ఎం రమా శ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అదనపు రవాణా కమిషనర్ మాట్లాడుతూ ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమేనని, యూనియన్‌నేతలు ఇచ్చిన మెమోరాండాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పశ్చిమ సిటీ ప్రధాన కార్యదర్శి ఇ.వి నారాయణ ,మోటా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.బ్రహ్మయ్య విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు బి.రూబెన్ కుమార్, ఎం.హనుమంతరావు, ఎస్.కె దుర్గావళి, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట్రావు సిహెచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు పెంచే స్మార్ట్ మీటర్లు వద్దు



విస్సన్నపేటలో కరపత్రాలు పంచుతున్న నాయకులు



జగ్గయ్యపేటలో కరపత్రాలు పంచుతున్న నాయకులు

ప్రజాశక్తి - విస్సన్నపేట : విద్యుత్ భారాలు పెంచే స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం తాతకుంట్ల గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు కమిటీ సభ్యులు గద్దల రామకృష్ణ శాఖ కార్యదర్శి గద్దల రాము పాల్గొని స్మార్ట్ మీటర్లను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. **జగ్గయ్యపేట :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించేలా ఆదాని విద్యుత్తుస్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారాలు మోపుతున్నారని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కోటా కృష్ణ అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట, సాయి నగర్‌లలో మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట కృష్ణ మాట్లాడుతూ విద్యుత్ బారాలను తగ్గిస్తామని గత ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చారని కానీ సంవత్సరంలో 15,485 కోట్ల రూపాయలు అదనంగా సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాన్నిమోపారన్నారు. స్మార్ట్ మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి షేక్ గౌస్ మియా, నాయకులు కోటా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విపిఎస్, కెసిపి స్కూల్స్‌లో వెంచురా -2025

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ యొక్క స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా వీరమా చనేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్, కానూరు కెసిపి సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్స్‌లో సాహిత్య, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. జులై 30, 31 తేదీలో రెండు రోజులు పాటు డ్రాయింగ్, డిబేట్, కవిత్వం, క్విజ్, నుక్కడ్ నాటకం, ప్రకటనల తయారీ, నత్య, సంగీతం మొదలైన పోటీలు వివిధ పాఠశాలల నుండి వస్తున్న విద్యార్థులతో పోటీల ప్రదర్శన జరుగుతుంది. విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుతున్నామని విపిఎస్ ప్రిన్సిపల్ మేడా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఆక్రమణలో ఆకువాని చెరువు

మొక్కుబడిగా అధికారుల నోటీసులు
పూర్తిస్థాయిలో చర్యలు శూన్యం
దర్జాగా కబ్జాలు చేస్తూ కాగితాలు
పుట్టిస్తున్న వైనం - చెరువు ఆక్రమణతో
వరదతో ముంచెత్తిన శాంతినగర్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి పట్టణ పరిధిలోని శాంతినగర్ వద్ద ఉన్న ఆర్ఎస్ నెంబర్ 232లోని ఆకువాని చెరువు 54 ఎకరాల్లో విస్తరించి ఉంది. గతంలో ఈ చెరువు కింద కొండపల్లి, కవులూరు, కట్టుబడిపాలెం, ఈలప్రోలు గ్రామాల్లో సుమారు 3వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందేది. ప్రస్తుతం ఆయకట్టు లేకపోవడంతో ఈ చెరువు ఆక్రమణలకు గురైంది. ప్రస్తుతం 10 నుండి 15 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. ఆక్రమణదారులు చెరువు కట్టని సైతం ఆక్రమించుకోవడంతో విజయవాడ – చత్తీషగడ్ జాతీయ రహదారి పక్కన ఆర్ అండ్ బి స్థలం కలుపుకొని అక్రమ నిర్మాణాలు వెలిశాయి. చెరువులు, నదుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం, సుప్రీంకోర్టు చట్టాలు చేస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. వాటి రక్షణకు సమర్థవంతమైన చట్టాలు చేసింది. కానీ చట్టాలను పరిరక్షించాల్సిన అధికారులే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరుపై స్థానికులు అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆకువాని చెరువును పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

లోగుట్టు పెరుమాళ్ళ కెరుక

జాతీయ రహదారిపై దర్జాగా ఆక్రమణదారులు నిర్మాణాలు చేపడుతున్నా చోద్యం చూస్తున్న అధికారుల, ప్రజా ప్రతినిధుల లోగుట్టు పెరుమాళ్ళ కెరుకని, చెరువు, చెరువు కట్ట అక్రమార్కుల చెరలో ఉందనే విషయం జగమెరిగిన సత్యం. అయినప్పటికీ ఆక్రమణదారులు తమ స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నాయంటూ బుకాయించడం, జాతీయ రహదారికి ఇరువైపులా పక్కా నిర్మాణాలు చేపడుతున్న హైవే అధికారులు పట్టించుకోక పోవడంపై కొండపల్లి మున్సిపాలిటీ కమిషనర్లు వచ్చినప్పుడల్లా నోటీసులు అందించి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం వచ్చిన వరదల్లో ఆకువాని చెరువుకు గండి పడటంతో ఇబ్రహీంపట్నం చత్తీస్ గడ్ జాతీయ రహదారి పైనుంచి నీరు ప్రవహించి శాంతినగర్‌ను ముంచెత్తింది. ఈ నేపథ్యంలో ఈ కబ్జాలపై కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల నుండి తీవ్రమైన విమర్శలు రావడంతో అధికారులు ఈ భూములలో ఉన్న వారికి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. మూడు రోజుల్లో ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చి నెల రోజులు గడుస్తున్న ఖాళీ చేయని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడవలసిన దిగా కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణలో నిర్మిస్తున్న కట్టడాలు

